సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 2 । ఆగస్టు । 2025



హాకీ పోటీలు ప్రారంభం

కాకినాడ జిల్లా క్రీడామైదానంలో 12 రోజుల పాటు జరగనున్న 15వ జాతీయ జూనియర్ బాలికల హాకీ పోటీలను కలెక్టర్ షణ్మోహన్ సగిలి శుక్రవారం రాత్రి ప్రారంభించారు.


8లో



రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి ఎం.ప్రేమ్ కుమార్ (రాజమహేంద్రవరం) శుక్రవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

కడలిలోకి 3.52 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 3,52,261 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 5 వేలు, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7 వేలు కలిపి 14,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.50 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



ముమ్మిడివరంలో అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ముమ్మిడివరం: అన్న క్యాంటీన్‌లో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. ముమ్మిడివరంలో గల అన్నా క్యాంటీన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడికి వచ్చిన వారితో మాట్లాడి క్యాంటీన్ సమయానికి తెరుస్తున్నారా, ఆహార పదార్థాల నాణ్యత ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ, టౌన్ ప్లానింగ్ అధికారి రాజేష్‌బాబు, ఏఈ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

ఆస్తి పన్ను ఆటోమ్యుటేషన్‌పై అవగాహన కల్పించాలి



ఆటోమ్యుటేషన్‌పై ఉద్యోగిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న వీరపాండ్యన్

కాకినాడ లీగల్: ఆస్తి రిజిస్ట్రేషన్‌తో పాటు వెంటనే ఆస్తి పన్ను ఆటోమ్యుటేషన్ చేసే ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రాష్ట్ర ఐజీ, జిల్లా ప్రత్యేక అధికారి జి.వీరపాండ్యన్ అన్నారు. ఆటోమ్యుటేషన్ విధానం అమలును తొలి రోజైన శుక్రవారం కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆయన పరిశీలించారు. ఆస్తి పన్ను ఆటోమ్యుటేషన్ జరుగుతున్న తీరు, సమస్యలపై ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ వసూలు రికార్డులను పరిశీలించారు. రోజువారీ జరుగుతున్న రిజిస్ట్రేషన్ల సంఖ్య, రిజిస్ట్రేషన్ల పురోగతిపై ఆరా తీశారు. జిల్లా రిజిస్ట్రార్ జేఎస్‌యూ జయలక్ష్మిని వివరాలడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం సేవలపై కక్షిదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరపాండ్యన్ మాట్లాడుతూ, ఆటోమ్యుటేషన్ ప్రక్రియపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో కరపత్రాలు, బ్రోచర్లు ముద్రించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచాలని సూచించారు. రోజువారీ రిజిస్ట్రేషన్ల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన, ట్రైనీ కలెక్టర్ మనీషా, జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు–1, 2 ఆర్‌వీ రామారావు, ఎస్‌వీఎస్‌ఎస్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజే ఇబ్బందులు

ఆస్తి పన్ను ఆటోమ్యుటేషన్ ద్వారా కాకినాడ, సర్పవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తొలి రోజే ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తొలుత కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను ఆటోమ్యుటేషన్ విధానంలో సమస్యలు రావడంతో క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. కాకినాడ, సర్పవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆటోమ్యుటేషన్ ద్వారా తొలి రోజు చెరొక డాక్యుమెంట్ మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయి.

నాడు ఎగవేత.. నేడు అడ్డుకోత



- రైతుల ఖాతాలో నేడు అన్నదాత సుఖీభవ నిధులు
- కూటమి ప్రభుత్వంలో తొలి ఏడాది అందని సొమ్ము
- తొలి ఏడాది రూ.14 వేల చొప్పున రూ.204 కోట్ల ఎగవేత
- తాజాగా లబ్ధిదారుల ఎంపికలో కోతలు
- ప్రస్తుత లబ్ధిదారులు 1,33,933 మందే!
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సగటున 1,45,890 మందికి లబ్ధి
- 11,957 మంది రైతులకు సొమ్ము లేనట్టే
- నాడు ఐదేళ్లలో రూ.482.55 కోట్ల అందజేత

సాక్షి, అమలాపురం: సాధారణ ఎన్నికల ముందు ఓటర్లకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం గ్రహణం పట్టిస్తోంది. విద్యార్థులకిచ్చిన తల్లికి వందనం పథకంలో పలు రకాలుగా కోత పెట్టిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు అన్నదాత సుఖీభవ పథకంలో సైతం భారీగా కోతలు విధిస్తూ లబ్ధిదారులైన రైతుల ఆశలపై నీళ్లు జల్లుతుంది. ఇప్పటికే ఒక ఏడాది అన్నదాత సుఖీభవ సొమ్ము విజయవంతంగా ఎగవేసిన కూటమి ప్రభుత్వం తాజాగా లబ్ధిదారులకు కోత పెట్టి వారి ఉసురు పోసుకుంటోంది. ఏడాదికి మూడు దఫాలుగా..

అన్నదాత సుఖీభవ నిధులు శనివారం జిల్లావ్యాప్తంగా లబ్ధిదారుల ఖాతాలో జమ కానున్నట్టు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 1,33,933 మందికి ఈ సొమ్ము అందనుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ సమ్మాన్ నిధులతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఈ ఏడాది తొలి దశ నిధులు రైతులకు అందనున్నాయి. ఏటా పీఎం కిసాన్ సమ్మాన్ పథకంలో ఒక్కొక్క రైతుకు రూ.ఆరు వేలను కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న విషయం తెలిసిందే. దీనిని రైతుల ఖాతాలో ఏడాదికి మూడు దఫాలుగా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మూడు దఫాలుగా అన్నదాత సుఖీభవ నిధులు అందించనున్నట్టు తెలిపింది. దీనిలో భాగంగా పీఎం కిసాన్ నిధులు రూ.2 వేలు, అన్నదాత సుఖీభవ నిధులు రూ.ఐదువేల చొప్పున మొత్తం రూ.ఏడు వేలు రైతుల ఖాతాలో జమ కానుంది. జిల్లాలో మొత్తం రూ.93.75 కోట్లు ఇవ్వనున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుకు రూ.20 వేల చొప్పున అందిస్తామని ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు హామీలు గుప్పించాయి. ఎన్నికలకు ఏడాది ముందు నుంచే టీడీపీ సూపర్ సిక్స్ పేరుతో ప్రచారం ఊదరగొట్టింది. పథకం అమలు అదిగో ఇదిగో అంటూ వాయిదాలు వేసుకుంటూ వచ్చిన కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు ఈ సొమ్ము రైతులు ఖాతాలలో వేసేందుకు సిద్ధమైంది. పీఎం కిసాన్ ద్వారా అందించే రూ.ఆరు వేలు, అన్నదాత సుఖీభవలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.14 వేలు కలిపి మొత్తం రూ.20 వేలను మూడు దఫాలుగా రైతులకు అందజేయనున్నట్టు ప్రకటించింది. ఆగస్టు 2న రూ.ఏడు వేలు, తిరిగి అక్టోబర్ నెలలో మరో రూ.ఏడు వేలు, ఫిబ్రవరి నెలలో రూ.ఆరు వేల చొప్పున అందజేయనున్నారు.

11,957 మంది రైతులకు మొండి చేయి

ఏడాది తర్వాత అమలు చేస్తున్న పథకంలో లబ్ధిదారులకు ప్రభుత్వం భారీగా కోత పెట్టింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా సగటున 1,45,890 మందికి రైతు భరోసా నిధులు నేరుగా వారి ఖాతాలో జమ చేసింది. కానీ కూటమి ప్రభుత్వం కేవలం 1,33,933 మందికి మాత్రమే ఈ పథకానికి లబ్ధిదారులుగా గుర్తించింది. అంటే సుమారు 11,957 మంది లబ్ధిదారులకు ఈ పథకంలో మొండి చేయి చూపించింది. వీరు తమకు రావాల్సిన రూ.23.9 కోట్లను నష్టపోనున్నారు. వీరు కాకుండా మరో 422 మంది లబ్ధిదారుల ఈ కేవైసీ ఈ నమోదు కాలేదని ప్రభుత్వం అంటోంది. అంటే వీరికి కూడా అన్నదాత సుఖీభవ సొమ్ము పడే అవకాశం కనిపించడం లేదు.

రూ.204 కోట్లు ఎగవేత

గత ఏడాది జూన్ 12వ తేదీన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. తాము గెలిచిన వెంటనే అన్నదాత సుఖీభవ సొమ్ము రైతులు ఖాతాలో జమ చేస్తామన్న ప్రభుత్వం గత ఏడాది ఇవ్వాల్సిన సొమ్మును ఎగ్గొట్టింది. జిల్లాలోని రైతులకు కేవలం పీఎం కిసాన్ సామాన్ నిధులు రూ.ఆరు వేలు మాత్రమే అందాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.14 వేలను కూటమి ప్రభుత్వం అందించలేదు. ఈ విధంగా జిల్లా రైతులు సుమారు రూ.204 కోట్లు నష్టపోయారని అంచనా.

గత ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా నిధులు క్రమం తప్పకుండా రైతుల ఖాతాలో జమ చేసేవారు. 2019 ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు రూ.12,500 అందజేస్తామని చెప్పింది. అధికారంలోకి వచ్చిన తరువాత పీఎం కిసాన్ సమ్మాన్ నిధులతో కలిపి రూ.13,500 రైతులు ఖాతాలో జమ చేశారు. రైతులతో పాటు కౌలుదారులు, దీర్ఘకాలంగా దేవస్థానం భూములు కౌలుకు తీసుకున్న రైతులకు సైతం ఈ సొమ్ము అందింది. ఒక్క కోనసీమ జిల్లాలోనే ఏడాదికి సగటున 1,45,890 మంది రైతులకు ఐదేళ్లకు గాను రూ.482.58 కోట్లు అందజేశారు.

అర్హత ఉన్న ప్రతి రైతుకూ అందజేయాలి



అన్నదాత సుఖీభవ పథకం అమలులో కూటమి ప్రభుత్వ విధానం వల్ల ఇప్పటికే రైతులు ఒక ఏడాది లబ్ధిని కోల్పోయారు. రెండవ ఏడాదిలో అయినా అర్హులైన ప్రతి రైతు, కౌలు రైతుకు సొమ్ము అందజేయాలి. నిబంధనల పేరుతో లబ్ధిదారులకు కోతలు పెట్ట వద్దు. రైతులు ఇప్పటికే పలు రకాలుగా నష్టపోయి ఉన్నారు.

– జిన్నూరి వెంకటేశ్వరరావు,
వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు,
నంగవరం, ఉప్పలగుప్తం మండలం

హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు శిరీష్



ఏవోకు వినతిపత్రం అందిస్తున్న శిరీష్ తదితరులు

అమలాపురం రూరల్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్, ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జిల్లెల్ల రమేష్ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కోరారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా నాలుగు రోజులుగా రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆదేశాలతో సంక్షేమ హాస్టళ్ల బాట కార్యక్రమం నిర్వహించామన్నారు. అక్కడి సమస్యలను తెలుసుకొని కలెక్టర్ ఏవో కాశీ విశ్వేశ్వరరావును కలిసి వివరించి వినతి పత్రం అందించారు. మౌలిక వసతులు కల్పించాలని కోరారు. విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు తాడి సహదేవ్, కోనసీమ జిల్లా ఏడు నియోజకవర్గాల విద్యార్థి విభాగం అధ్యక్షులు గంటి ఆకాష్, అబ్బిరెడ్డి వీర్రాజు, గొల్లపల్లి రాజశేఖర్, దంగేటి శ్రీప్రసాద్, చొల్లంగి నవీన్, గొల్లపెల్లి నవీన్, జిల్లా విద్యార్థి విభాగం నాయకులు దొమ్మేటి అర్జున్, కరుణ సాయి, పృథ్వీ పాల్గొన్నారు.

11లోపు ఇంటర్‌లో చేరాలి

అమలాపురం టౌన్: జనరల్, ఒకేషనల్ ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఈ నెల 11వ తేదీలోపు విద్యార్థులు చేరాలని డీఐఈవో వనుము సోమశేఖరరావు సూచించారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ విద్యామండలి నిర్ణయించిందని గుర్తు చేశారు. ఇప్పటి వరకూ ఇచ్చిన గడువు తేదీ జూలై 31తో ముగిసిందన్నారు. తాజాగా ఇచ్చిన గడువు లోపు జిల్లాలో ఇంకా చేరాల్సిన విద్యార్థులు ఎవరైనా ఉంటే అడ్మిషన్లు పొందాలని సూచించారు.

దాత సాయంతో స్కూల్‌కు డైనింగ్ హాల్



దాత విరాళంతో నిర్మించిన డైనింగ్ హాల్

మామిడికుదురు: స్థానిక జెడ్పీహెచ్ స్కూల్ ప్రాంగణంలో పాశర్లపూడి గ్రామానికి చెందిన భూపతి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యులు రూ.35 లక్షలతో అధునాతన డైనింగ్ హాల్ నిర్మించారు. స్కూల్ పూర్వ విద్యార్థి అయిన నాగేశ్వరరావు ఈ ప్రాంతం ప్రజలకు ఉచితంగా వైద్యం అందించి పేదల డాక్టర్‌గా గుర్తింపు పొందారు. అతని పేరిట స్కూల్ ప్రాంగణంలో శాశ్వత కట్టడం నిర్మించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించి డైనింగ్ హాల్‌ను నిర్మించారు. డైనింగ్ హాల్ నిర్మాణంతో పాటు 40 స్టీలు బెంచీలు, 20 టేబుల్స్ కొని ఇచ్చారు. ప్రస్తుతం ఈ స్కూల్లో 460 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. స్కూల్‌లో అమలు చేస్తున్న మధ్యాహ్నం భోజనం తీనేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని డైనింగ్ హాల్ నిర్మించారు. శనివారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశామని హెచ్‌ఎం బి.చిరంజీవిరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో ఇద్దరికి చోటు

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో జిల్లా నుంచి ఇద్దరి పార్టీ నేతలకు పదవులు దక్కాయి. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా మండపేట నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకుడు యాంద్ర ప్రభాకరరావు, పార్టీ రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ సెక్రటరీగా ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన వల్లభుని నాగూర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నియామక ఉత్తర్వులను జిల్లా పార్టీకి పంపించింది.

సైబర్ మోసాలపై అవగాహన

బ్యాంక్ అధికారులకు ఎస్పీ కృష్ణారావు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్న క్రమంలో బ్యాంక్‌ల ఖాతాదారులు ఆ మోసాల బారిన పడకుండా వారిలో చైతన్యాన్ని నింపి అవగాహన కల్పించాలని ఎస్పీ బి.కృష్ణారావు వివిధ బ్యాంక్‌ల అధికారులకు సూచించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సైబర్ మోసాల నియంత్రణపై శుక్రవారం జరిగిన వాణిజ్య బ్యాంకుల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ ఖాతాలపై ఎప్పటికప్పుడు పరిశీలన ఉండాలన్నారు. కేవైసీ సిస్టమ్స్‌ను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఖాతాదారుల ఖాతాల్లో అధిక మొత్తంలో నగదు లావాదేవీలు జరుగుతుంటే అలాంటి ఖాతాలను గమనించి మొదటి దశలోనే ఖాతాదారులను అప్రమత్తం చేయాలన్నారు. సైబర్ అఫెన్స్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్ డిజిటల్ అరెస్ట్ వంటి నేరాలకు సంబంధించిన విషయాలను ఎస్పీ చర్చించి బ్యాంక్‌ల అధికారులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ పేరుతో నేరగాళ్లు భారీ ఎత్తున డబ్బును లూటీ చేస్తున్నారని వివరించారు. దీనిపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ బ్యాంక్‌లో సైబర్ నేరాలపై ఫిర్యాదు చేసేందుకు, అకౌంట్ ఫ్రీజ్ విషయంలో '1930' టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయడానికి పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. పలు బ్యాంక్‌ల మేనేజర్లతో పాటు జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, అమలాపురం, కొత్తపేట డీఎస్పీలు టీఎస్ఆర్‌కే ప్రసాద్, సుంకర మురళీమోహన్, ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల జిల్లా యూనియన్ ఎన్నిక



డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

అమలాపురం టౌన్: జిల్లా మధ్యాహ్న భోజన పథకం కార్మికులు స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో శుక్రవారం సమావేశమై జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ సీహెచ్ లోవలక్ష్మి అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా యూనియన్ గౌరవాధ్యక్షురాలిగా కె.కృష్ణవేణి, అధ్యక్షురాలిగా ఎస్.బేబీ సరోజిని, ప్రధాన కార్యదర్శిగా టి.నాగవరలక్ష్మి, కోశాధికారిగా ఎస్.వెంకటలక్ష్మి, ఉపాధ్యక్షులుగా దుర్గ, కరుణ, సంయుక్త కార్యదర్శిగా లోవలక్ష్మి ఎన్నికయ్యారు. మొత్తం 23 మందితో యూనియన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. మధ్యాన్న భోజన పథకానికి బడ్జెట్ పెంచి కార్మికులు వేతనాలు పెంచాలని సమావేశం డిమాండ్ చేసింది. కార్మికునికి రాష్ట్ర ప్రభుత్వం కనీసం రూ.10 వేల వేతనం ఇవ్వాలని సూచించింది. వంట చేసేటప్పుడు కార్మికులకు ప్రమాదం జరిగితే రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సమావేశం డిమాండ్ చేసింది. సమావేశంలో కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేశారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఘనంగా చండీహోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పండితులు హోమం ప్రారంభించారు. హోమంలో 40 మంది భక్తులు పాల్గొన్నారు. సత్యదేవుని ప్రధానాలయంలో స్వామివారి దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, కొండ దిగువన తొలి పావంచా వద్ద కనకదుర్గ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

రాజధానికి లక్ష ఎకరాలు అవసరమా?

- చంద్రబాబు పాలన ఈవిధంగా ఉంటుందని ఊహించలేదు
- కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చింతా మోహన్



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర రాజధానిని లక్ష ఎకరాల్లో నిర్మిస్తామంటున్నారని, అంత భూమి అవసరమా అని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ ప్రశ్నించారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్, బెంగళూరు, భువనేశ్వర్‌లలో వెయ్యి ఎకరాలతో రాజధాని నిర్మించారన్నారు. రైతుల భూములు లక్ష ఎకరాలు ఎందుకు సేకరించాలని, వారి పొట్ట ఎందుకు కొట్టాలని నిలదీశారు. 50 అంతస్తుల భవనాలు నిర్మించాలని చంద్రబాబు అంటున్నారని, కృష్ణా తీరంలో అన్ని అంతస్తులతో భవనాల నిర్మాణం సాధ్యమా అని ప్రశ్నించారు. ఎయిర్ పోర్టు కడతామంటున్నారని, వర్షం కురిస్తే ఆ ప్రాంతం ముంపునకు గురవుతోందని, అప్పుడు నీటిలో నడిపే విమానాలు తీసుకొస్తారా అని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం రాజధాని పూర్తి చేస్తుందన్న నమ్మకం తనకు లేదన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి చాలా చిన్న వయస్సు నుంచే తనకు తెలుసన్నారు. ఆయన తల్లిదండ్రులు కూడా తనకు తెలుసని, మిథున్‌రెడ్డి అరెస్టు చాలా బాధాకరమని మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. మిథున్‌రెడ్డి చిన్న బిడ్డ అని, రాజకీయాల్లో చాలా జాగ్రత్తగా ఉండాలని సలహా ఇచ్చారు. చంద్రబాబు పాలన గురించి ఎంతో ఊహించానని, కానీ, ఆయన పాలన వలన రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని అన్నారు. ఇప్పటి వరకూ అప్పులు చేయడానికే మాత్రమే చంద్రబాబు చూస్తున్నారు తప్ప రాష్ట్రానికి ఏ మేలూ చేయలేదని అన్నారు. రాష్ట్రంలో పోలీసులు పచ్చచొక్కా కనిపిస్తే సెల్యూట్ కొడుతున్నారని, మిగిలిన వారిని శత్రువులుగా చూస్తున్నారు ఇది సరికాదని మోహన్ అన్నారు.

క్లుప్తంగా

ముద్రగడ క్షేమంగా ఉన్నారు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం క్షేమంగా ఉన్నారని ఆయన పెద్దకుమారుడు వీర్రాఘవరావు(బాలు) తెలిపారు. ముద్రగడ ఇటీవల ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యి విశ్రాంతి తీసుకుంటున్న విషయం విదితమే. ముద్రగడ పద్మనాభం ఆరోగ్యంతో క్షేమంగాని ఉన్నారని, కొద్దిరోజుల పాటు హైదాబాద్‌లోనే ఉండి విశ్రాంతి తీసుకుంటారని ఆయన పెద్ద కుమారుడు వీర్రాఘవరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఆయనకు విశ్రాంతి ఎంతో అవసరమని వైద్యులు సూచించారన్నారు. ఆయనను చూసేందుకు హైదరాబాద్ ఎవరు వెళ్లొద్దని ఆయన కోరారు. త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో ఆయన జనం ముందుకు వస్తారని తెలిపారు.

ఎంపీడీఓలు పెసా చట్టంపై కలిగి ఉండాలి


పెసా చట్టంపై శిక్షణ ఇచ్చిన ఫ్యాకల్టీ రవిశంకర్

సామర్లకోట: ఎంపీడీఓలు పంచాయతీల విస్తరణ చట్టం (పెసా)పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీ ఎ.రవిశంకర్ అన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాల్లో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు ఐదవ రోజు పెసా చట్టంపై శిక్షణ నిర్వహించారు. రవిశంకర్ మాట్లాడుతూ ఈ చట్టాన్ని షెడ్యూల్డ్ ప్రాంతాలకు చెందినవారి కోసం 1996లో అమలులోకి తీసుకు వచ్చారన్నారు. ఈ చట్టం షెడ్యూల్డ్ తెగల ప్రజల సంప్రదాయ హక్కులను పరిరక్షించడం, స్వయం పరిపాలనకు ప్రాధాన్యం ఇవ్వడం కోసం ప్రవేశపెట్టారన్నారు. ఈ చట్టంపై అవగాహన కల్పించడానికి వారి గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్‌లో అమలు చేస్తున్నారని వివరించారు. పంచాయతీలకు సంబంధించి రాజ్యాంగంలోని కొన్ని హక్కులను షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరించారని చెప్పారు. గిరిజన జనాభాలో ఎక్కువ మందికి స్వయం పాలన కల్పించాలన్నారు. వారి ఆస్తులను పరిరక్షించవలసిన బాధ్యత ఎంపీడీఓలపై ఉంటుందని తెలిపారు. మరో ఫ్యాకల్టీ కేఆర్ నిహారిక పెసా చట్టం పై క్విజ్ పోటీలను నిర్వహించారు.

గాజుల సింగారం

శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా నగరం గ్రామ దేవత శ్రీదొడ్డి గంగాలమ్మను స్థానికులు గాజులతో విశేషంగా అలంకరించారు. సౌభాగ్యానికి ప్రతీకగా భావించే గాజులను దండలుగా కూర్చి అమ్మవారి మెడలో అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. గాజులతో అలంకార శోభితమైన దొడ్డి గంగాలమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లించారు.

– మామిడికుదురు



నోట్ల తోరణం

నగరంలోని దేవీచౌక్‌లో శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి ఆలయంలో అమ్మవారిని రూ.45వేల కొత్త నోట్లతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

–సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం)



అరుదైన అలంకారం

మండల పరిధిలోని వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారు గాజుల అలంకరణతో దర్శనమిచ్చారు. మహిళలు అందరూ పసుపు, కుంకుమలు, చలివిడి, పానకం, వడపప్పు, గాజులు, శ్రావణమాసం సారెతో వానపల్లి కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్దకు చేరుకున్నా రు. అక్కడి నుంచి మేళతాళాలతో బయలుదేరి తూము సెంటర్ వినాయకుడి గుడి, మెయిన్‌రోడ్డు మీదుగా పళ్లాలమ్మ వారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆసాదులకు గాజులు, నైవేద్యాలు, సారె సమర్పించగా వారు అమ్మవారికి గాజులు అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహి క కుంకుమ పూజలు నిర్వహించారు. –కొత్తపేట



స్కూల్‌లో క్షుద్రపూజలు?


యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్


పాఠశాల ఆవరణలో పూజలు చేసిన ఆనవాళ్లు

- ఆకతాయిల పనిగా గుర్తింపు
- విద్యార్థులకు కౌన్సెలింగ్

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో క్షుద్రపూజలు జరిగినట్లు జోరుగా ప్రచారం జరిగింది. శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చే సమయానికి పాఠశాల ఆవరణలో ముగ్గులు వేసి నిమ్మకాయలు, పసుపు, కుంకుమతో పూజలు చేసిన విషయాన్ని గుర్తించారు. దాంతో అప్పటికే పాఠశాలకు వచ్చిన కొంతమంది విద్యార్థులు ఈ రోజు పాఠశాల లేదు అంటూ ఇళ్లకు వెళ్లి పోవడం ప్రారంభించారు. దాంతో విషయాన్ని గమనించిన సైన్సు ఉపాధ్యాయురాలు ఏఎల్‌వీ కుమారి ఆవరణలో ఉన్న నిమ్మకాయలను తీసి వేసి ముగ్గులను చెరిపించారు. విద్యార్థులను క్లాసు రూములకు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. హెచ్ఎం కె.శ్రీదేవి వచ్చిన తరువాత విషయం తెలుసుకొని ఎదురుగా షాపులో ఉన్న సీసీ కెమెరాలో గురువారం సాయంత్రం ఏడు గంటల నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు దృశ్యాలను పరిశీలించారు. ఆ దృశ్యాలలో పాఠశాల ఆవరణలోకి ఎవరూ వచ్చినట్లు కనిపించ లేదు. దాంతో ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు పాఠశాల హెచ్ఎం శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాలలోని ఆకతాయి విద్యార్థులు చేసిన పనిగా అనుమానం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం సమయంలో విద్యార్థులు ఈ పని చేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు విద్యార్థులకు సీఐ ఎ కృష్ణ భగవాన్‌తో కౌన్సెలింగ్ ఇప్పిస్తామని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు రాకుండా ఉండటానికి ఇటువంటి పని చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులతో కూడా సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. పాఠశాలలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హెచ్ఎం తెలిపారు.

మెరుగుపడిన ఆగమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం

అన్నవరం: తీవ్ర అస్వస్థతకు గురై తుని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న అన్నవరం దేవస్థానంలోని ఎనిమిది మంది సత్యదేవ స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. ఈ విద్యార్థులు గురువారం తీవ్ర అస్వస్థతకు గురవడంతో వారిని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్న విషయం తెలిసిందే. తీవ్ర జ్వరంతో బాధడుతున్న మరో ముగ్గురు విద్యార్థులను శుక్రవారం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి కూడా చికిత్స అందించడంతో వారు కోలుకున్నారని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. కాగా, త్వరలోనే 11 మంది విద్యార్థులను డిశ్చార్జి చేస్తామని తుని ప్రభుత్వాసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ స్వప్న తెలిపారు.

విద్యార్థులను పరామర్శించిన దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్

చికిత్స పొందుతున్న స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులను దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆయన ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు కారణమేంటని ఆయన అధికారులను ప్రశ్నించగా గత నాలుగు రోజులుగా కొండదిగువన ఆరెంపూడి సత్రంలో దత్తపీఠం ఆధ్వర్యంలో జరిగిన యాగంలో విద్యార్థులు పాల్గొన్నారని మంగళవారం వరకు అక్కడే భోజనాలు చేశారని తెలిపారు. బుధవారం ఉదయం వీరు ఆగమ పాఠశాలలో భోజనాలు చేశారని తెలిపారు. ఆ మధ్యాహ్నం నుంచి వాంతులు, విరేచనాలతో బాధపడడంతో స్థానిక దేవస్థానం ఆసుపత్రిలో వైద్యం అందించామని తెలిపారు. గురువారం పరిస్థితి విషమించడంతో వారిని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. అనంతరం ఆయన అన్నవరం దేవస్థానంలో స్మార్త ఆగమ పాఠశాలను కూడా పరిశీలించారు. ఆయన వెంట దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు, ఆర్‌జేసీ వి.త్రినాథరావు ఉన్నారు.


తుని ప్రభుత్వాసుపత్రిలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్

11వ తరగతి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పొడిగింపు

పెద్దాపురం: 2025–26 విద్యా సంవత్సరంతో పాటు పెద్దాపురం పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయలో ఖాళీగా ఉన్న 11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు విద్యాలయ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 11వ తరగతిలో హ్యూమానిటీ స్ట్రీమ్ (హిస్టరీ, ఎకనామిక్స్, జియోగ్రఫీ)లో అడ్మిషన్లకు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి 50 శాతం మార్కులుతో ఉత్తీర్ణత పొందినవారు అర్హులన్నారు. పీఎంశ్రీ జవహర్ విద్యాలయలో ఈ నెల 1వ తేదీ నుంచి దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, ఏడవ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

కమ్యూనిటీ హాల్ అమ్మేశారంటూ జనసేన నేతపై ఫిర్యాదు

సఖినేటిపల్లి: జనసేన నాయకుడు ఒకరు కుటుంబ సభ్యులతో కలసి క్రైస్తవ కమ్యూనిటీ హాల్ అండ్ చర్చిని అమ్మేశారంటూ సంఘ సభ్యులు సఖినేటిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిధులతో నిర్మించి, కామన్ కమ్యూనల్ ప్రోపర్టీగా ఉన్న శాంతి నగర్ క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ అండ్ చర్చిని ఆక్రమించుకోవడానికి కుట్రలు పన్నుతున్న వారిపైన, ఇందుకు సహకరించిన వారిపైన చర్యలు తీసుకోవాలని శుక్రవారం పోలీసులకు ఇచ్చిన పై ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. సంఘ అధ్యక్షుడు గొల్లమందల వసంతరావు, కార్యదర్శి గంటా రాజ్ కుమార్, కోశాధికారి పల్లికొండ వెంకటరమణ, క్రైస్తవ సమాజ సభ్యులైన గొలమందల వినయ్‌బాషా, సంఘ సభ్యులు కలిసి పై ఫిర్యాదు చేశారు.

సఖినేటిపల్లి శాంతినగర్‌లో ఎనిమిది సెంట్ల భూమిలో కామన్ కమ్యూనిటీ హాల్ అండ్ చర్చి ఉంది. చర్చికి సంబంధించి 500 మంది సభ్యులు ఉన్నారు. తొలుత 2017లో ఏపీ ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక గ్రాంటుతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరిగింది. సభ్యులు దీనినే చర్చిగానూ ఉపయోగిస్తున్నారు. పలువురు దాతలు చర్చి అభివృద్ధికి విరాళాలు ఇచ్చారు. అప్పట్లో చర్చి అభివృద్ధి చేస్తున్న సమయంలో తాత్కాలిక అధ్యక్షుడిగా తాడి నారాయణమూర్తి పేరును చర్చి మీద రాసి హక్కుదారుడిగా పేర్కొన్నారు. కాగా కమ్యూనిటీ హాల్, చర్చికి సంబంధించిన విషయంలో రెండు నెలలుగా సభ్యుల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయి. వివాదం ముదిరి పాకాన పడడంతో పంచాయతీ పోలీసుల వరకూ వెళ్లింది. సంఘ పాలక వర్గ సభ్యులు తమపై దాడులు చేశారంటూ జనసేనకు చెందిన సీనియర్ నాయకుడు, తన వ్యతిరేక వర్గంపై స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. అధికారం అడ్డుపెట్టుకుని తమపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆ జనసేన లీడర్‌పై ఇటీవల రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు సంఘ సభ్యులు ఫిర్యాదు చేశారు. వివాదం ఇలా ఉండగా జూలై 26న కమ్యూనిటీ హాల్ అండ్ చర్చి భవనాన్ని జనసేన లీడర్, కుటుంబ సభ్యులు కలిసి, తమ తాతయ్య నారాయణమూర్తి, చర్చి స్థలదాత గెడ్డం సుందరమ్మ ద్వారా స్వీకరించిన దాన పట్టాపై తమ కుటుంబానికి హక్కులు ఉన్నాయని నారాయణమూర్తి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. నారాయణమూర్తి కుటుంబ సభ్యులు మా గ్రామంలోని కొంత మందితో కలిసి, కమ్యూనిటీ హాల్ అండ్ చర్చి ఆస్తులను ఆక్రమించుకోవడానికి కుట్రలు పన్నుతున్నారని ఫిర్యాదులో సంఘ సభ్యులు పేర్కొన్నారు. క్రీస్తు లూథరన్ చర్చి ప్రతినిధి బర్రే అబ్రహాంకు అనుకూలంగా కుట్రపూరిత రిజిస్టర్ సెటిల్మెంట్ డీడ్‌ను అమలు చేశారని, రాజోలు సబ్ రిజిస్ట్రార్‌తో కుమ్మక్కై అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. ఈ సెటిల్మెంట్ డీడ్‌ను అమలు చేయడంలోను, కమ్యూనిటీ హాల్ అండ్ చర్చి ఆస్తులను ఆక్రమణలో భాగస్వాములైన, సహకరించిన మొత్తం 12 మందిపై చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో కోరారు.


సఖినేటిపల్లి శాంతినగర్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్ అండ్ చర్చి

ట్యూబెక్టమీ చేస్తే ప్రాణాలు పోయాయి

- కాకినాడ జీజీహెచ్‌లో వివాదం
- విచారణకు త్రిసభ్య కమిటీ నియామకం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ట్యూబెక్టమీ (కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్స) చేయించుకున్న ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబసభ్యులు ఆరోపించారు. వివరాల్లోకి వెళితే, కాకినాడ జగన్నాథపురానికి చెందిన పలపాల సుధారాణి(21)ని సోమవారం కుటుంబ సభ్యులు కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. మంగళవారం ఆమెకు ట్యూబెక్టమీ నిర్వహించారు. అనంతరం ఆమెను జీఐసీయూకి తరలించారు. ఆ సమయంలో పల్మనరీ ఎడీమా సంభవించి ఉదరం నుంచి పదార్థాలు ఊపిరితిత్తుల్లోకి చేరాయి. పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్‌పై అనుసంధానం చేశారు. రెండు రోజుల పాటు వైద్యులు ఆమెను రక్షించేందుకు శ్రమించగా శుక్రవారం ఉదయం 6.53 సమయానికి కార్డియాక్ అరెస్ట్ సంభవించి ప్రాణాలు కోల్పోయింది. కాకినాడ జీజీహెచ్ వైద్యుల నిర్లక్ష్యం వల్లే సుధారాణి ప్రాణాలు కోల్పోయిందని మృతురాలి కుటుంబీకులు ఆరోపించారు.

కూతురికి పేరు పెట్టకుండానే...

సుధారాణికి దుర్గాప్రసాద్‌తో 2017లో వివాహం అయింది. దుర్గాప్రసాద్ కార్పెంటర్ కాగా అతడికి చేదోడు వాదోడుగా సుధారాణి పలుచోట్ల పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకురావడంతో తోడుగా నిలుస్తోంది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. ఐదేళ్ల బాబు వీర లోకేష్ కాగా, నెలన్నర క్రితం పుట్టిన కుమార్తెకు కనీసం పేరు కూడా పెట్టలేదు. తన కుమార్తెకు మంచి పేరు పెట్టాలని సుధారాణి అందరినీ అడిగిందని, మంచి పేరు సూచించాలని కోరిందని, పండంటి బిడ్డకి పేరు పెట్టకుండానే ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మరణం వివాదాస్పదమైన తరుణంలో వాస్తవాలను వెలికి తీసేందుకు త్రి సభ్య కమిటీని నియమించారు. సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ పి.నరేష్ కుమార్, పాథాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సుజీవ స్వప్న, ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రాజేష్ కుమార్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. సుధారాణి మృతదేహానికి శుక్రవారం పోస్ట్‌మార్టం నిర్వహించారు. అంతకుముందు జీఐసీయూలో సుధారాణి మృతదేహాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్ పరిశీలించారు.


కొడుకు వీర లోకేష్‌తో ఆడుతూ సుధారాణి


సుధారాణి మృతదేహం

నాఫ్తాల్ ట్యాంకర్ బోల్తా

- తప్పిన పెను ప్రమాదం
- భారీ క్రేన్లతో ట్యాంకరును బయటకు తీసిన వైనం

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాక ఓఎన్‌జీసీ రిఫైనరీ నుంచి చెన్నై వెళుతున్న నాఫ్తాల్ ట్యాంకర్ గురవారం అర్ధరాతి గోతిలో బోల్తా పడింది. ఓఎన్‌జీసీ, ఫైర్ సిబ్బంది ట్యాంకర్‌ను సురక్షితంగా బయటకు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి దొమ్మేటివారిపాలెంలో 216 జాతీయ రహదారి పక్కన ఈ ట్యాంకర్ అదుపు తప్పి గోతిలో పడిపోయింది. పేలుడు స్వభావం ఉన్న 29వేల లీటర్ల నాఫ్తాల్ ఉన్న ఈ ట్యాంకర్ బోల్తా పడటంతో అధికారులు అప్రమత్తయయ్యారు. ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలా సాగర్, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. ఘటనా స్థలానికి 100 మీటర్ల పరిధిలో ఉన్న గ్రామస్తులను వారి ఇళ్ల నుంచి ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఓఎన్‌జీసీ అధికారులతో సంప్రదిస్తూ ఘటనా స్థలంలో ఉండి పరిస్థితిని సమీక్షించారు. శుక్రవారం ఉదయం ఓఎన్‌జీసీ సెక్యూరిటీ ఆఫీసర్ బలరామ్ ఆధ్వర్యంలో పోలీసు, ఫైర్ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేశారు. ఎటువంటి పేలుడు సంభవించకుండా ఫోమ్ ఉపయోగించారు. రెండు అంబులెన్స్‌లు, నాలుగు అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచి నాలుగు క్రేన్‌లు, ఒక భారీ క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను సురక్షితంగా బయటకు తీయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ట్యాంకర్‌కు మరమ్మతులు చేసి చెన్నై పంపించారు.


భారీ క్రేన్ల సహాయంతో నాఫ్తాల్ ట్యాంకర్‌ను బయటకు తీస్తున్న ఓఎన్‌జీసీ, ఫైర్ సిబ్బంది

గాయకుడి గొంతు మూగబోయింది

- గొంతు ఇన్ఫెక్షన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రాము
- ఆపరేషన్ కోసం రూ.1.80 లక్షలు ఖర్చవుతుందని నిర్ధారించిన వైద్యులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

నిడదవోలు : జూనియర్ గద్దర్‌గా పేరుగాంచిన దళిత సామాజిక జానపద కళాకారుడి గొంతు మూగబోయింది. వేలాది వేదికలపై తన గానంతో శ్రోతలను ఉత్తేజపరిచిన గాయకుడి గొంతు మూగపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన దళిత కళా మండలి వ్యవస్థాపకుడు, జానపద కళాకారుడు భావన రాము కొంతకాలంగా గొంతు ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. ఆయనకు భార్య కమలమ్మ, పుట్టుకతోనే మూగ అయిన కుమార్తె ఉన్నారు. రామును చాలామంది జూనియర్ గద్దర్ అని కూడా పిలుచుకుంటారు. గొంతు ఇన్ఫెక్షన్‌తో రాము రాజమహేంద్రవరంలోని అంజనా వైద్యాలయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు గొంతులో కణితిలు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం రాము మాట కూడా పడిపోయింది. సకాలంలో గొంతు సర్జరీ చేయకపోతే అది గొంతు క్యాన్సర్‌కు దారితీస్తుందని వైద్యులు చెప్పడంతో ఆందోళన చెందుతున్నారు. గొంతు సర్జరీకి రూ.1.80 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో పూట గడవడం కష్టంగా ఉన్న రాము దాతల ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. గాయకుడు రాము ఇండియన్ ఓవర్ సీస్ బ్యాంకు అకౌంట్ నంబర్ 06420100 0043780కు సాయం అందించాలని కోరుతున్నారు.


బావన రాము (ఫైల్)

జూనియర్ మహిళల హాకీ పోటీలు ప్రారంభం

ఈ నెల 10 వరకు నిర్వహణ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడాకారులను ప్రోత్సహించడం అందరి బాధ్యత అని కలెక్టర్ షణ్మోహన్ సగిలి పేర్కొన్నారు. కాకినాడ జిల్లా క్రీడామైదానంలో 12 రోజుల పాటు జరగనున్న 15 వ జాతీయ జూనియర్ బాలికల హాకీ పోటీలను శుక్రవారం రాత్రి కలెక్టర్ ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో డబుల్ ఒలింపియన్, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత ఎస్.గీత జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్కరించగా, ఇండియన్ హాకీ పతాకాన్ని ఎస్.గీత, ఇండియన్ హాకీ సెలెక్షన్ కమిటీ సభ్యులు అసుంటా లక్రా ఆవిష్కరించారు. ఈ పోటీలలో 30 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారు. 2026–27 సంవత్సరానికి మహిళా హాకీ వరల్డ్ కప్‌లో పాల్గొనే భారత జట్టును ఈ టోర్నీలో ఎంపిక చేయనున్నారు. ప్రారంభ కార్యక్రమంలో అతిథులుగా పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, రాజబాబు, కుడా చైర్మన్ టి.రామస్వామి, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ మీనా, ఎస్పీ బిందుమాధవ్, అడిషనల్ ఎస్పీ మానిష్; డీఎఫ్ఓ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా క్రీడామైదానంలో ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూల మాల వేసి కలెక్టర్ నివాళులు అర్పించారు. 18 జట్ల క్రీడాకారులు మార్చ్ పాస్ట్ నిర్వహించారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ ఈ టోర్నీ క్రీడాకారులకు మధుర స్మృతిగా నిలుస్తుందన్నారు. టోర్నీ కోఆర్డినేటర్ రవిరాజు, డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, ఆర్‌డీఓ మల్లిబాబు పాల్గొన్నారు.


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

తొలిరోజు విజేతలు

కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శుక్రవారం ప్రారంభమైన 15వ జాతీయ జూనియర్స్ మహిళల హాకీ పోటీలలో భాగంగా తొలిరోజు ఏ డివిజన్‌లో గోయన్స్ హాకీ, జమ్మూకాశ్మీర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో గోయన్స్ హాకీ జట్టు 2–1 స్కోర్‌తోను, తెలంగాణ, గుజరాత్ మధ్య నిర్వహించిన మ్యాచ్‌లో గుజరాత్ 4–1 స్కోర్‌తోను, మిజోరామ్, రాజస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో మిజోరాం12–0 స్కోర్‌తోను విజయం సాధించాయి.

బి డివిజన్‌లో మణిపూర్, కేరళ మధ్య జరిగిన మ్యాచ్‌లో మణిపూర్ 5–0 స్కోర్‌తోను, అస్సాం, పాండుచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో అస్సాం 5–0 స్కోర్‌తోను, హిమాచల్‌ప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో అరుణాచల్‌ప్రదేశ్ 6–2 స్కోర్‌తోను విజయం అందుకున్నాయి. ఢిల్లీ, హాకీ అసోసియేషన్ ఆఫ్ బీహార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6–3 స్కోర్‌తోను విజయం సాధించాయి. శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లను టోర్నీ కో–ఆర్డినేటర్ వి.రవిరాజు పర్యవేక్షించారు.


కాకినాడ డీఎస్ఏలో శుక్రవారం జరిగిన జాతీయ మహిళల హాకీ పోటీలలో తలపడుతున్న క్రీడాకారిణులు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	6,000
ఒక కిలో	400

అమ్మవార్ల ఆలయాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీస్

కొత్తపేట/రావులపాలెం: శ్రావణమాసం సందర్భంగా వివిధ ప్రాంతాల అమ్మవార్ల ఆలయాలకు ఏపీఎస్ ఆర్టీసీ రావులపాలెం డిపో నుంచి ప్రత్యేక బస్ సర్వీసు ఆదివారం బయలుదేరుతుందని ఆ డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ తెలిపారు. ఆ మేరకు ఆయన శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం – ముత్యాలమ్మతల్లి, కొల్లేటికోట – పెద్దింట్లమ్మతల్లి, భీమవరం – మావుళ్లమ్మతల్లి, యనమదుర్రు – పార్వతీ సమేత శక్తీశ్వర స్వామి, కాళ్లకూరు – శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి (స్వయంభూ), ఆచంట – బాలాత్రిపురసుందరీ సమేత రామలింగేశ్వరస్వామి, సత్తరామేశ్వరం – శ్రీరామేశ్వరస్వామి (త్రిలింగ క్షేత్రం), పెనుగొండ – వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాలను ఒకరోజులో దర్శించుకునేలా బస్ సర్వీసు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఒక వ్యక్తికి టిక్కెట్ రూ.450 అని తెలిపారు. ఈ బస్సు రావులపాలెం బస్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఉదయం 6 గంటలకు బయలుదేరి పై క్షేత్రాలు అన్నీ దర్శించి రాత్రి 8 గంటలకు తిరిగి రావులపాలెం చేరుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఏపీఎస్ఆర్టీసీ రావులపాలెం డిపో అసిస్టెంట్ మేనేజర్ 7382911871, టీసీహెచ్ వీరభద్రరావు 7382912400, ఆర్ఎస్ రావు 7382912398, బస్ స్టేషన్ ఎంక్వైరీ 9959225549 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

మహిళను కాపాడిన పోలీసులు


మహిళను కాపాడిన ధవళేశ్వరం పోలీసులు

ధవళేశ్వరం: ఆత్మహత్య చేసుకోబోయిన ఓ మహిళను ధవళేశ్వరం పోలీసులు కాపాడారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక మహిళ ధవళేశ్వరం బ్యారేజీ పైనుంచి గోదావరిలోకి దూకేందుకు ప్రయత్నించింది. ఈ విషయంపై డయల్ 112కి సమాచారం రావడంతో జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు ధవళేశ్వరం ఇన్‌స్పెక్టర్ గణేష్ వెంటనే స్పందించారు. హెడ్ కానిస్టేబుళ్లు జీవీ నరసయ్య, సాంబశివరావు ఘటనా స్థలానికి చేరుకుని సదరు మహిళను గుర్తించి కాపాడారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం ఇన్‌స్పెక్టర్, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, కంట్రోల్ రూమ్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.